క్లుప్తంగా

శరవేగంగా అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు



ఆటోనగర్ ఈ - బ్లాక్‌లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ నిర్మాణ పనులు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లో ఇక బహిరంగంగా ఎలక్ట్రికల్ వైర్లు కనిపించవు. రాష్ట్రంలో ప్రప్రథమంగా అండర్ గ్రౌండ్ ఎలక్ట్రికల్ కేబుల్ నిర్మాణం ఆటోనగర్‌లో ప్రారంభమైంది. సుమారు రూ.150 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించారు. ఆటోనగర్ ఈ – బ్లాక్‌లో పనులు ప్రారంభించి ఇప్పటికే 20 శాతం పనులు పూర్తయ్యాయి. ఆటోనగర్‌లోని 10 బ్లాక్‌లలో అండర్ గ్రౌండ్ ఎలక్ట్రికల్ కేబుల్ ఏర్పాటు చేస్తున్నారు.

కుష్టు రహిత సమాజమే ధ్యేయం



అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా

పెదగంట్యాడ : కుష్టు రహిత సమాజమే ధ్యేయం కావాలని దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రదీప్ ప్రసాద్ రాజా అన్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శ లేకపోయినా, చర్మం పాలిపోయినా, ఎరుపు రంగు మచ్చలు, చర్మం మందంగా మారడం, తిమ్మిర్లు రావడం కుష్టు వ్యాధి లక్షణాలని తెలిపారు. ఈ వ్యాధిని తొల దశలో గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ, ఎం.శ్రీనివాసరావు, బంకురు గోపాలం, వెంకటలక్ష్మి, సునీత, వెంకటేష్, పర్వీన్ బేగం, సరోజిని, అప్పలరత్నం పాల్గొన్నారు.

2న గాజువాక పరస



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, నాయకులు

గాజువాక : వచ్చేనెల 2న బీసీ రోడ్‌లో నిర్వహించనున్న శ్రీసీతారామ ఉమా రామలింగేశ్వర స్వామి పరస (గాజువాక పరస)ను అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు పరస పోస్టర్‌ను నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి తదితరుల గురువారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పరసను ప్రతి ఏడాది ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు గంధం శ్రీను, మహ్మద్ ఇమ్రాన్, పల్లా శ్రీనివాసరావు, భూపతిరాజు సుజాత, స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రసాదుల శ్రీనివాస్, దొడ్డి రమణ, పిల్లా శంకరరావు, గోమాడ వాసు, మద్ది శంకర రెడ్డి, గుణ శ్రీను, ఎలమంచిలి పైడిరాజు, పొలమరశెట్టి వాసు, పిట్టా ప్రకాష్‌రెడ్డి, బుల్లెట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో పార్కు ప్రారంభించిన కేంద్రమంత్రి



పార్కు ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కును కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి గురువారం ప్రారంభించారు. స్టీల్‌ప్లాంట్ పర్యటనలో భాగంగా ఆయన ఉదయం బ్లాస్ట్‌ఫర్నేస్–2 ర్యాంపు ఎదురుగా తయారు చేసిన రిసర్జెన్స్ (పునరుజ్జీవనం) పార్కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్కులో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కేంద్ర ఉక్కు సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర ఆరోగ్య మంత్రి సత్యకుమార్, ఎంపీలు శ్రీభరత్, సీఎం రమేష్, కె. అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, కేంద్ర ఉక్కు కార్యదర్శి సందీప్ పౌండ్రిక్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ సంజయ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

జాయ్‌ఫుల్ జర్నీ: సాహసమేరా జీవితం

- కొండలు ఎక్కుదాం
- జలపాతాలు వీక్షిద్దాం
- ప్రకృతి ప్రియుల కోసం 'యూత్ హాస్టల్స్' సిద్ధం

ప్రస్తుతం ప్రజల జీవన విధానమంతా ఉరుకుల పరుగులమయమే. నిద్ర లేచింది మొదలు.. పడుకునే వరకు ఎవరి పనుల్లో వారు నిత్యం బిజీబిజీ. ఉద్యోగ బాధ్యతలు నిర్వహించే వారైతే విధి నిర్వహణలో నిత్యం ఒత్తిడికి గురవుతుంటారు. గజిబిజి జీవితం నుంచి బయటపడి కాస్త మానసిక ప్రశాంతత, వినోదం, ఉల్లాసం, ఉత్సాహం కోసం పరితపిస్తుంటారు. అయితే ప్రస్తుతం నగరం, పల్లె అనే తేడా లేకుండా పరిసరాలన్నీ కలుషితమై పోయాయి. దీన్ని చూసి జనాలు బయటకు రావడానికి ఏ మాత్రం సాహసించడం లేదు. ఒకవేళ సాహసించి బయటకు వచ్చినా ఏ సినిమాకో లేదా రెస్టారెంట్, షాపింగ్‌మాల్‌కో మాత్రమే పరిమితమవుతున్నారు. కొందరు మాత్రం పచ్చని ప్రకృతిని, జలజలా పారే సెలయేళ్ల పరవళ్లను ఆస్వాదించాలని పరితపిస్తుంటారు. ఇలాంటి వారి కోసం తాము ఉన్నామని అభయహస్తం ఇస్తోంది యూత్ హాస్టల్స్ అసోసియేషన్.



ట్రెకింగ్‌లో యూత్ హాస్టల్స్ ప్రతినిధులు



కైట్ ఫెస్టివల్‌లో..

ఉక్కునగరం: రణగొణధ్వనులు, **కలుషిత పరి**సరాలకు దూరంగా జరిగి.. నిశి**రాత్రి వేళ** పున్నమి వెన్నెల్లో ఇసుక **తిన్నెలపై** నడక, ఎత్తైన పర్వతాలు ఎక్క**డం,** సాహస యాత్రం చేయడం, కను చూపు మేర కనిపించే కనిపిం**చే** పచ్చని చెట్లు, అడవులు, జలపాతాలు, కొండలు వీటన్నింటిని చు**ట్టి** రావడానికి యూత్ హాస్టల్స్ కల్పి**స్తున్న** సౌకర్యాలు అమోఘం, అనిర్వ**చనీయం** అని చెప్పవచ్చు.

యూత్ హాస్టల్స్ ముఖ్య లక్ష్యం ట్రెక్కింగ్

యూత్ హాస్టల్స్ అసోసియేషన్ శా**ఖల ముఖ్య** లక్ష్యం ట్రెకింగ్. గజిబిజి జీవితానికి దూరం**గా** అసలు పేరు కూడా వినని ప్రాంతాలు, అడవులు, కొండలు, ఎడారులు, సుదూర తీర మైదానంలో కాలినడకన చేసే విహార, విజ్ఞాన, సాహస యాత్రలనే ట్రెకింగ్ అని నిర్వచించవచ్చును.



మూన్‌వాక్‌లో

1991లో ఉక్కునగరం శాఖ ఆవిర్భావం

రొటీన్‌కు భిన్నమైన జీవితాన్ని కోరుకునే వారి కోసం యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఉక్కు**నగరం** శాఖ ఏర్పడింది. ఉక్కునగరం ప్రజలే కాకుండా అనేక మంది ఈ శాఖ ద్వారా పలు ప్రదేశాలను చుట్టి వచ్చారు. అసలు యూత్ హాస్టల్స్ నేపథ్యం, లక్ష్యం, యూత్ హాస్టల్స్ ఉక్కునగరం శాఖ చేపట్టిన **కార్యక్రమాలను తెలుసుకుంటే ఎవరైనా మెచ్చుకో**వాల్సిందే. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 1991 నవంబర్ 27న 66 మంది సభ్యులతో యూత్ హాస్టల్స్ ఉక్కునగరం శాఖ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ శాఖలో 700 మంది జీవిత సభ్యులు ఉన్నారు. ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో ఫ్యామిలీ క్యాంప్, ట్రెక్కింగ్, సైకిలింగ్, కైట్ ఫెస్టివల్, బ్లడ్ డొనేషన్, మూన్ వాక్, సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ప్రతీ **ఏడాది 10 నుం**చి 12 కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రతీ ఏడాది వలే ఈ ఏడాది కూడా సంక్రాంతికి కై ట్స్ ఫెస్టివల్, వేసవిలో నిండు పౌర్ణమి రోజు మూన్ వాక్, డిసెంబర్‌లో లంబసింగి టూర్ నిర్వహించారు. గత ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు జగదల్‌పూర్‌కు రెండు సార్లు ఫ్యామిలీ క్యాంప్ నిర్వహించారు. అదే విధంగా ప్రతీ ఏడాది జనవరి 26న తిరుపతి సమీప శేషాచలం ఫారెస్ట్‌లో ట్రెకింగ్‌కు తీసుకు వెళ్తారు. ప్రతీ ఏడాది పిల్లల కోసం ఉక్కునగరం నుంచి కొండకర్ల ఆవ లేదా అప్పికొండ బీచ్‌కు సైక్లింగ్ యాత్ర నిర్వహిస్తున్నారు. యూత్ డే సందర్భంగా జనవరి 12న రక్త దాన శిబిరం నిర్వహించారు. ఏటా రెండుసార్లు అనాథ ఆశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు వెళ్లి వారికి వస్తువులను అందజేస్తుంటారు.



బాలలకు సైక్లింగ్ యాత్ర



లంబసింగ్ ఫ్యామిలీ క్యాంప్

భారతదేశంలో యూత్ హాస్టల్స్

భారతదేశంలో 1949 జూలైలో మైసూర్ విశ్వవిద్యాలయం వారి రూ. 500తో యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉద్యమం ప్రారంభమైంది. అనంతరం టాటా ట్రస్ట్, భారత ప్రభుత్వ విద్యాశాఖ అందించిన విరాళాలతో జాతీయ స్థాయిలో ఈ ఉద్యమానికి బీజాలు పడ్డాయి. స్వల్ప ధనంతో విస్తృత పర్యటనలకు అవకాశాలు కల్పించటం, నామమాత్రం రుసుంతో వసతి కల్పించడం, ట్రెకింగ్, హైకింగ్, పర్వతారోహణ, మోటార్ సైకిల్‌పై సాహస యాత్ర చేయటం, జాతీయ సమగ్రత, సమైఖ్య పెంపు, యువతకు దేశ భౌగోళిక పరిస్థితులపై అవగాహన, పర్యాటక ప్రదేశాలకు సంబంధించి సమాచారాన్ని సభ్యులకు తెలియజేయడం లక్ష్యంగా ఈ సంస్థ పనిచేస్తోంది.



యూత్ హాస్టల్స్ ఏర్పాటు...

జర్మనీకు చెందిన రిచర్డ్‌స్చెర్‌మాన్ అనే ఉపాధ్యాయుడు యువతలో సాహస ప్రవృత్తి, సమైక్యత, సామాజిక అంశాలపై స్పందన, పర్యావరణ పరిరక్షణ, పర్యాటక రంగాల్లో ఆసక్తి, అభ్యుదయ దృక్పథానికి దోహదం చేయడానికి 1909లో యూత్ హాస్టల్స్ ప్రారంభించారు. ఇప్పుడు సుమారు 90 దేశాల్లో 4.5 మిలియన్ సభ్యులతో 4,200 హాస్టల్స్‌తో ప్రపంచంలో గొప్ప సంస్థగా ఏర్పడింది.

కొత్త ప్రాంతాలపై అవగాహనే ధ్యేయం

తక్కువ ధరతో, సురక్షితమైన విధంగా భారతదేశంలోని మారుమూల ప్రాంతాలకు, ఎవరూ వెళ్లలేని ప్రాంతాలకు సాహస యాత్రలు చేసేది యూత్ హాస్టల్స్ మాత్రమే. ప్రతి ఒక్కరూ అందరితో మమేకమై వారి అలవాట్లు, అభిరుచులు, సంప్రదాయాలు పంచుకోవడమే ధ్యేయంగా యూత్ హాస్టల్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

–వీఆర్‌కె రాజు, చైర్మన్, ఉక్కునగరం యూనిట్

మహాత్ముని మార్గం అనుసరణీయం



కణితిలో గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి



గాంధీజీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న పీవీ రమణ



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

పెదగంట్యాడ: అహింసా మార్గంలో జాతిని మేల్కొలిపి స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుండి నడిపించిన జాతిపిత మహాత్మాగాంధీ యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని జీవీఎంసీ 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని వార్డు పరిధి నడుపూరు గాంధీ పార్కులో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నడుపూరు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు. పెదగంట్యాడ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో గ్రంథాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వాడవాడలా..

అగనంపూడి: పలు ప్రాంతాల్లో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గోవింద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి పాల్గొని గాంధీ చిత్ర పటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రగడ శ్రీనివాసరావు, బొడ్డ సన్యాసిరావు, ఆడారి శ్రీను, మార్పు శేషు, దుగ్గపు దానప్పలు, పిన్నింటి సంతోష్, ప్రగడ శంకరరావు, దుగ్గపు వాసు, బొండా గోవిందరాజులు, నరసింహమూర్తి, బొడ్డ వెంకటసూరి, ఎస్‌వి నాయుడు,దాసరి అప్పడు పాల్గొన్నారు. 79వ వార్డు పాత అగనంపూడి కూడలి మహాత్మా గాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.కోటేశ్వరరావు, మంగవేణి, అమరపిని వరలక్ష్మి, చిత్తా నాగమణి పాల్గొన్నారు.

తీర్థమహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



రాముల వారి తీర్థమహోత్సవం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు హరిజనజగ్గయ్యపాలెం శ్రీ రాముల వారి తీర్థమహోత్సవం కరపత్రాన్ని గ్రామ నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. గురువారం గ్రామంలోని రామాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రతినిధులు మాట్లాడుతూ ఫిబ్రవరి 14వ తేదీన జరిగే తీర్థమహోత్సంలో జరిగే కార్యక్రమాలను వివరించారు. అనంతరం గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు కరపత్రాన్ని ఆవిష్కరించారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

గాజువాక : స్థానిక సుందరయ్య కాలనీలోని జీవీఎంసీ 10 ఎంజీడీ వాటర్ ప్రాజెక్టులో నిర్వహణ, మరమ్మతులు చేపట్టనున్న దృష్ట్యా శుక్రవారం పలు వార్డులకు తాగునీటి సరఫరా ఉండదని వాటర్ సప్లై సహాయ ఇంజినీరు పి.కేదార్‌నాథ్ తెలిపారు. వాటర్ ప్లాంట్‌లోని ఫిల్టర్ బెడ్లు, క్లారిఫ్లోక్యులేటర్, సంపులను శుభ్రపర్చడంతోపాటు చిన్నచిన్న మరమ్మతులు కూడా చేపట్టనున్నామని పేర్కొన్నారు. ఈ కారణంగా 70 నుంచి 74వ వార్డు, 76, 64, 65 వార్డులకు శుక్రవారం నీటి సరఫరా ఉండదని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అగనంపూడి: వడ్లపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వాహణ పనులు కారణంగా శుక్రవారం ఆ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు వడ్లపూడి, వడ్లపూడి నిర్వాసితకాలనీలు, లక్ష్మీపురం కాలనీ, చెట్టిబలిజ వీధి, తిరుమల నగర్, సీడబ్ల్యూసీ ప్రాంతం గవర వీధి, సిద్ధార్థనగర్, ఆటోనగర్ ఈ బ్యాంక్ పారిశ్రామిక ప్రాంతం, అపరల్ పార్కు, కణితి అంబేడ్కర్ కాలనీ, గణేష్‌నగర్‌ల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి శాంతి కల్యాణం



శ్రీవారి శాంతి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీవారి శాంతి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం సాయంత్రం దివ్యక్షేత్రంలో స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రవణ నక్షత్ర యుక్త శాంతి కల్యాణాన్ని అశేష భక్త జనసందోహం మధ్య నిర్వహించారు. వేకువ జాము నుంచే స్వామికి విశేష పూజలు, అర్చనలు, భక్తులకు నిజరూప దర్శనాలు చేపట్టారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

పెంటమాంబ ఆలయ అభివృద్ధికి తోడ్పాటు



పెంటమాంబ ఆలయ అభివృద్ధికి విరాళం అందజేస్తున్న ఉక్కు గర్తింపు సంఘం నాయకులు

పెదగంట్యాడ: మండలంలోని నెల్లిముక్కు ప్రజల ఆరాధ్య దేవత పెంటమాంబ ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా ఏప్రిల్‌లో అమ్మవారి పండగను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల కోసం స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం, కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్ సభ్యులు నిధులు అందజేస్తున్నారని వివరించారు. గత ఏడాది ఖర్చులకు సంబంధించి విరాళాన్ని గురువారం అందజేశారు. సీడబ్ల్యూసీ కార్యదర్శి ఉరుకూటి రమణయ్య, కోశాధికారి నందికి చిన్నారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు మహేశ్వరరెడ్డి, వెంకటరమణారెడ్డి, అప్పలరెడ్డి, శ్రీనివాసరావు, అప్పారావు పాల్గొన్నారు.

కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామికి వినతుల వెల్లువ



కేంద్ర మంత్రి కుమారస్వామికి వినతిపత్రం అందజేస్తున్న పోరాట కమిటీ నాయకులు



ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని నినాదాలు చేస్తున్న కార్మికులు, సంఘ నాయకులు

ఉక్కునగరం/అగనంపూడి : స్టీల్‌ప్లాంట్ పర్యటనలో ఉన్న కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి, సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మలకు స్టీల్‌ప్లాంట్ పోరాట కమిటీ నాయకులు, ఉక్కు అధికారుల సంఘం (సీ), ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, ఓబీసి అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రాలు అందజేశారు. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్‌డీ నాగార్జున హాలులో జరిగిన కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులతో వినతిపత్రాలు అందజేశారు. స్టీల్‌ప్లాంట్ సమస్యల పరిష్కారానికి సెయిల్‌లో విలీనం చేయాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, సిబ్బంది నియామకాలు చేపట్టాలని, ఉద్యోగులకు సత్వరం పూర్తి వేతనాలు చెల్లించాలని, ఫైర్ విభాగం ఈడీఐ విరమించుకోవాలని నాయకులు కె.ఎస్.ఎన్. రావు, మంత్రి రాజశేఖర్, జె. అయోధ్యరామ్ తదితరులు కోరారు. సీ నాయకులు అందజేసిన వినతిపత్రంలో ఉక్కు రంగాన్ని స్ట్రాటజిక్ రంగంలో పెట్టాలని, విలువ ఆధారిత ఉక్కుకు టన్నుకు రూ. 3 వేలు ప్రభుత్వం సాయం అందించాలని, పదోన్నతులు కల్పించాలని, ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని నాయకులు కాటం చంద్రరావు, కె.వి.డి. ప్రసాద్, చంద్ర వెంకటేశ్వరరావులు కోరారు. ఎస్సీ, ఎస్టీ నాయకులు అందజేసిన వినతిపత్రంలో సెయిల్‌లో విలీనం చేయడం స్టీల్‌ప్లాంట్ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసి పిల్లలకు ఉక్కునగరంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని నాయకులు బయ్యే మల్లయ్య, బి.తౌడన్న, మోహన్‌బాబు, ఎల్.వి.రమణారావు కోరారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు బకాయిపడిన ఐదు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని ఐఎన్‌టీయుసీ నాయకులు, ఏఐపీఎఫ్ రాష్ట్ర సమన్వయకర్త ధర్మాల వ్యాసశర్మ వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని నినాదాలు

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించేలా ప్రధానమంత్రి ప్రకటన చేయాలని, సొంత గనులు కేటాయించాలని, ప్యాకేజీ ప్రకటించిన ఉక్కు మంత్రికి స్వాగతం పలుకుతూ నినాదాలు చేశారు. కూర్మన్నపాలెం రిలే దీక్షా శిబిరంలో ఉదయం కార్మికులు, సంఘ నాయకులు పాల్గొన్నారు. మంత్రి కాన్వాయ్ వచ్చే సమయానికి దీక్షా శిబిరం వద్ద నిల్చొని బిగ్గరగా నినాదాలు చేశారు. మంత్రి దీక్షా శిబిరాన్ని వీక్షిస్తూ కాన్వాయ్ కదిలింది. పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎస్.రామారావు , డీసీహెచ్.వెంకటేశ్వరరావు, వరసాల శ్రీనివాసరావు, మసేసురావు, త్రిష్ట్ మూర్తి, ప్రసాద్, సీహెచ్.సన్యాసిరావు, డేవిడ్, దాసరి శ్రీను పాల్గొన్నారు.

